## చైన్ స్నాచింగ్..

మన్సూరాబాద్, మార్చి 10: ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని యువకుడు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం...హయత్‌నగర్ పరిధి, మర్రిపల్లికి చెందిన స్వరూప(70) ఇంటి వద్దనే ఉంటుంది. సోమవారం ఉదయం బైక్‌పై గుర్తు తెలియని యువకుడు కాలనీకి వచ్చాడు. ఇంట్లో పడుకుని ఉన్న స్వరూప వద్దకు వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల ఆచూకీని అడిగాడు. సదరు వృద్ధురాలు తనకు ఎవరూ తెలియదని చెబుతుండగానే ఒక్క ఉదుటున ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసును అపహరించుకుని పరారయ్యాడు. స్వరూప కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి వచ్చారు. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి బైక్‌పై పారిపోయాడు. బాధితులు నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ దొంగ అరెస్ట్

ఎల్బీనగర్, మార్చి 10: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. గత జనవరి నెలలో సరూర్‌నగర్ వీఎం హోమ్ గ్రౌండ్ ప్రక్కన పార్కింగ్ చేసిన స్ప్లెండర్ ప్లస్( టీఎస్ 07 ఎఫ్‌పీ 2438) బైక్ చోరీ గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి.. ప్రియదర్శిని పార్కు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ధరావత్ లచ్చిరాం, రమావత్ దేవ్‌ లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా బోరీ విషయం బయటపడింది. నిందితుడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

## గంజాయి విక్రేతపై కేసు

మేడ్చల్,మార్చి 10: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ రోడ్డులో ఎక్సైజ్ అధికారులు సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి చిక్కాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహిస్తుండగా ఒడిశాకు చెందిన సమర్ సర్కార్ 3.5 కిలో ఎండు గంజాయితో పట్టుబడ్డాడు. గంజాయి ని స్వాధీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేశారు.

# అణగారిన వర్గాల్లో అక్షర జ్యోతి సావిత్రిబాయి పూలే

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- పలు ప్రాంతాల్లో ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి



సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్‌లో..

మన్సూరాబాద్, మార్చి 10: సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని.. అణగారిన వర్గాల మహిళల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మనసురాబాద్ డివిజన్ సహారా స్టేట్స్ కాలనీ రెండవ గేటు సమీపంలోని చిత్రసీమ కాలనీ వద్ద ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు విద్య ఆవశ్యకతను తెలియజేసి.. వారిలో చైత న్యం నింపిన గొప్ప మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆమె జీవిత చరిత్రను ప్రతి మహిళ తెలుసుకోవాల్సిన అవస రం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీశ్ యాదవ్, రుద్రయాదగిరి, విజయ భా స్కర్ రెడ్డి, సతీశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

- సహారా రెండవ గేటు వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహానికి మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ,బీయన్ రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీ ప్రసన్న, తదితరులు వేర్వేరుగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్, హరీశ్‌రెడ్డి, యంజాల జగన్, పూలే యువజన సంఘం సభ్యులు మేడిగ శ్రీధర్, శనిగారపు స్వామి, చామకూర రాజు, కేవీ గౌడ్, బొంగు వెంకటేశ్‌గౌడ్, నకిరేకంటి శ్రీనివాస్, నేరడ సైదులు, సోమేశ్ కుమార్, నరేశ్ చారి, తదితరులు పాల్గొన్నారు.
- ఆర్కేపురం : సరూర్‌నగర్ డివిజన్, జింకలబావి కాలనీలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేర బాలకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు మల్కాజిగిరి దయానంద్, కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ బబ్బురి దయానంద గౌడ్, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆకుల అరవింద్ కుమార్, కబీర్ దాస్, యాంద్రా కల్పనా లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.



జింకలబావి కాలనీలో..

- ఎల్బీనగర్ : తొలి మహిళా ఉపాధ్యాయులు సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా శాసన మండలి సభ్యుడు బొగ్గరపు దయానంద్ గుప్తా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- న్యూ నాగోల్‌లోని డాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి నాగోల్ డివిజన్ నాయకుడు ఉడతల మల్లేశ్ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు గా సమాజంలోని అణగారిన వర్గాల, అట్టడుగు వర్గాల స్త్రీలకు విద్యను అందించడానికి అనేక త్యాగాలను చేసినటువంటి మహిళా మూర్తి, సామాజిక విప్లవకారిని సావిత్రిబాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, జయ, జగన్ యాదవ్, సంగు సైదారావు చెరుకు ఈశ్వర్ గౌడ్, కరుణాకర్, శివకుమార్, జైనుల్లావుద్దీన్ పాల్గొన్నారు



హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో అధ్యాపకులు

## మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలి

హయత్‌నగర్, మార్చి 10 : మహిళలు ఉద్యోగ, వ్యాపార, రాజకీయ, ఆర్థిక రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించాలని హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేశ్‌బాబు సూచించారు. సోమవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల మహిళా సాధికారికత విభాగం, జాతీయ సేవాపథకం యూనిట్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులకు పాటలు, నృత్య, మెహందీలపై పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశామని తెలిపారు. మహిళా సాధికారికత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ అపర్ణ చతుర్వేది మాట్లాడుతూ.. బలమే జీవనం.. బలహీనమే మరణం.. అన్ని విషయాల్లో ముందుకెళ్లాలని అ న్నారు. అలాగే స్త్రీల ఆరోగ్యంలో యోగా పాత్ర గురించి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అనిత విద్యార్థులకు వివరించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శారదా దేవి విద్యార్థులకు సమాజ సేవలో పునర్ అంకితం కావాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్.. మహిళా అధ్యాపకులను, సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, డాక్టర్ గీతా నాయక్, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ రమాదేవి, లావణ్య , అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం లోపించకుండా చర్యలు



బడంపేట్, మార్చి 10: పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి అన్నారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సరస్వతి ఆదేశాల మేరకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. 21వ డివిజన్‌లో నాలాను క్లీన్ చేశామని, 30, 32వ డివిజన్లలో మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయించామని తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో, మురికినీటి కాలువల్లో, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం వేయవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా విధిస్తామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆటోలో చెత్త వేయాలన్నారు. పారిధ్యం లోపించకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 10:** ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన 55 వినతులను స్వీకరించారు.కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, లాఆఫీసర్ చంద్రావతి, డీఆర్డీవో సాంబశివరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత సేవా దృక్పథంతో పని చేయాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సీతారాం పాండు

కందుకూరు , మార్చి 10 : యువకులు సేవా దృక్పథంతో పనిచేయాలని కందుకూ రు పోలీస్ స్టేషన్ సీఐ సీతారాం తెలిపారు. కందుకూరు గ్రామంలో ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మాజీ ఎంపీటీసీ సరికొండ పాండుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేశ్, పాముల రవీందర్ ,చిందం ప్రశాంత్, కందడి శ్రీనివాస్, పట్నం సురేశ్ ,సరికొండు జగన్, ఎగ్గిడి సత్తయ్య,, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్ ఆర్ఎస్‌పై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



ఎల్ఆర్ఎస్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో నరసింహారెడ్డి

ఆర్.కె పురం, మార్చి 10: ప్రభుత్వం ఎల్ ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ కల్పిస్తుందని ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలని టీయూఎఫ్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం సరూర్‌నగర్ డివిజన్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఎల్ఆర్ఎస్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కల్పించినటువంటి ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాలి



డాక్టర్స్ కాలనీలో శ్రీ శివ సూర్య రామాలయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఆర్కే పురం, మార్చి 10: హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని సరూర్‌నగర్ , ఆర్కేపురం డివిజన్ల కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి అంజన్ , రాధా ధీరజ్‌రెడ్డిలు అన్నారు. సోమవారం సరూర్‌నగర్ డివిజన్, డాక్టర్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శివ సూర్య రామాలయం శంకుస్థాపన పూజా కార్యక్రమాన్ని వేదపండితులు బ్రహ్మశ్రీ సన్నిధానం శ్రీధర శర్మ చేతులమీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఎక్కడా లేని విధంగా మన ప్రాంతంలో శ్రీ శివ సూర్య రామాలయం నిర్మించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు . ఈ కార్యక్రమంలో కాలి సంక్షేమ సంఘం ప్రతినిధులు ఒక్కలంక శ్రీనివాసరావు, జెమిని రామ్మూర్తి, రామాచార్యులు, పొన్నాడి శ్రీనివాస్, శివరాం, దయాకర్, జనార్ధన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, చంద్రయ్య, రామన్ గౌడ్, నరేశ్, మమత, సరిత, నిత్య, కృష్ణకుమారి, సంధ్య, రాధిక, రమ, వాణి, సీత, విజయలక్ష్మి, నాగేశ్, తిరుపతయ్య, ప్రకాశ్, హనుమంత్, సాగర్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్డు విస్తరణ చేపట్టాలి

ఆర్కేపురం, మార్చి 10: సరూర్‌నగర్ ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్డు విస్తరణ చేపట్టాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె.. జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కలిసి.. సరూర్‌నగర్ డివిజన్‌లోని సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ..సరూర్‌నగర్ ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల ప్రతినిత్యం ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పోస్ట్ ఆఫీస్ మెయిన్ చౌరస్తా కావడంతో అక్కడ రోడ్డు వెడల్పు లేకపోవడం వల్ల పక్కనే బస్ స్టాప్ ఉండడంవల్ల గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. రోడ్డు విస్తరణ చేపట్టాలని గతంలోనే జోనల్ కమిషనర్‌ను కలిసి సమస్య వివరించడం జరిగిందని చెప్పారు. మరోసారి జోనల్ కమిషనర్‌ను కలిసి విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పోస్ట్ ఆఫీస్ చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ చేపట్టి, స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.

## ఇంటి పన్నులు తగ్గించాలని ధర్నా

బడంగ్‌పేట, మార్చి10: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెంచిన ఇంటి పన్నులు తగ్గిం చాలని కోరుతూ బీజేపీ నేతలు పసునూరి భిక్షపతి చారి, తులసీ ముకేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, జిల్లా ప్రజా పరిషత్ ప్రజా పాలన కార్యక్రమంలో అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌లకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కీసర గోవర్ధన్ రెడ్డి, సోమేశ్వర్,జిల్లా నాయకులు మద్ది రాజశేఖర్ రెడ్డి గారు, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ డివిజన్ కార్యవర్గం



కందుకూరు, మార్చి 10 : ఎమ్మార్పీఎస్ కందుకూరు డివిజన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా యశ్వంత్, అధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా శ్రీను, ఉపాధ్యక్షులుగా రాందాసు, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్ , కార్యవర్గ సభ్యులుగా బాలరాజ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



హయత్‌నగర్, మార్చి 10 : హయత్ నగర్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర శివారు ప్రాంతమైన హయత్‌నగర్ డివిజన్ పరిధిలో అనేక నూతన కాలనీలు వెలిశాయని తెలిపారు. ఆయా కాలనీల్లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆర్టీసీ మజ్దూర్ కాలనీ అధ్యక్షుడు సూర్యనాయక్, కాలనీవాసులు ఉన్నారు.

## సీపీఐ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

బడంగ్‌పేట, మార్చి10: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడలో మంగళవారం నిర్వహించే సీపీఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు దత్తు నాయక్ కోరారు. కమ్యూనిస్టు పార్టీ చారిత్రక నేపథ్యాన్ని, పోరాటాల చరిత్రను గుర్తు చేసుకుంటూ నిర్వహించే సభను విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్, ప్రజా వ్యతిరేక విధానాలను చర్చించడానికి మార్చి 11న సెమినార్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీలో అత్యధిక భారీ సంఖ్యలో ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని దత్తు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ హరగోపాల్, పాశం యాదగిరి, తదితరులు హాజరవుతారని తెలిపారు.

# టీఎన్జీవో నేత శ్రీనివాస్‌రావుకు ఘన నివాళి



ఉద్యమనేత శ్రీనివాస్ రావుకు నివాళులర్పిస్తున్న ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్

బడంగ్‌పేట్, మార్చి 10: మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నాదర్‌గుల్, ద్వారకపురి కాలనీలో నివాసముంటున్న తెలంగాణ ఉద్యమకారుడు, టీఎన్జీవో కోశాధికారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామినేని శ్రీనివాసరావు మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేసి, పార్థివ దేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో మాజీ చైర్మన్లు దేవి ప్రసాద్, శ్రీధర్, నాయకుడు పల్లె రవికుమార్ గౌడ్, తెలంగాణ ఉద్యమ నేత ప్రకాశ్, టీఎన్జీవో కేంద్ర కమిటీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల నారాయణ గౌడ్, టీఎన్జీవో నాయకులు ఉమా రెడ్డి, కొండల్ రెడ్డి, విక్రమ్ కుమార్, శ్రీనివాస్, హరికృష్ణ, లక్ష్మణ్, సుధాకర్, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవింద్ రెడ్డి, మాజీ ఎంపీపీ నిరంజన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, తెలంగాణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ చెవ్వూరు హరి కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి , కమిషనర్, డైరెక్టర్‌తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, టీఎన్జీవో అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ , తదితరులు ఉన్నారు.

## సాయిబాబా ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా కొప్పుల



మన్సూరాబాద్, మార్చి 10: మన్సూరాబాద్ డివిజన్ , శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయ సంస్థ చైర్మన్‌గా కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిబాబా దేవాలయ అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, సాయినాథ్, కొప్పుల ఉపేందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మోహన్ రెడ్డి, సత్తయ్య, డీఎస్ రామారావు, ప్రదీప్ కుమార్, జగన్ మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రత్నాచారి పాల్గొన్నారు.

# మహిళా ఖైదీల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపాలి

**తెలంగాణ ఉపాధి, శిక్షణ సంస్థ స్పెషల్ సెక్రటరీ సంజయ్ కుమార్**




చంచల్ గూడ మహిళా జైలులో టైలరింగ్ కోర్సు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ ఉపాధి, శిక్షణ సంస్థ స్పెషల్ సెక్రటరీ సంజయ్ కుమార్, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, తదితరులు

సైదాబాద్, ఫిబ్రవరి 10 : మహిళా ఖైదీల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపి వారిని శక్తివంతులుగా తయారుచేయడానికి ప్రత్యేక చర్య లు తీసుకోవాలని తెలంగాణ ఉపాధి, శిక్షణ సంస్థ స్పెషల్ సెక్రటరీ సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం చంచల్‌గూడ మహిళా జైలు లో మహిళా ఖైదీల కోసం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంకల్ప్ పథకంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన టైలరింగ్ కోర్సు సెం టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. జైలు జీవితం అనుభవిస్తున్న మహిళా ఖైదీలు విడుదల అనంతరం ఆర్థిక స్వావలంబనతో, సమాజంలో గౌరవ ప్రదంగా జీవించే విధంగా కృషి చేయాలన్నారు. ఖైదీల ఆత్మగౌరవంతోపాటు సరికొత్త జీవితాన్ని కొనసాగించడానికి తోడ్పాటు అందించాలని, వారిలో మా ర్పులు చేసుకొని రావడానికి చొరవ చూపాలన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. తెలంగాణ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంకల్ప్ పథకంలో భాగంగా జైలు మహిళా ఖైదీలకు స్వయం ఉపాధి, శిక్షణ కార్యక్రమంలో టైలరింగ్ కోర్సు ఎంతగానో ఉపయోగపడనుందన్నారు. ఖైదీల సంస్కరణ కార్యక్రమా ల్లో భాగంగా పునరావాసం, స్వయం ఉపాధి శిక్షణ తరగతుల ముఖ్య ప్రాముఖ్యతను గుర్తించి పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ రాజేశ్, శ్రీనివాస్, చంచల్‌గూడ మహిళా జైలు సూపరింటెండెంట్ వెంకట లక్ష్మి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సెల్లార్ పనులు ఆపండి..



సైదాబాద్, ఫిబ్రవరి 10 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అపార్ట్‌మెంట్ సెల్లార్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలని లక్ష్మీనగర్ వాసులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఐఎస్ సదన్ డివిజన్, లక్ష్మీనగర్ చౌరస్తాలో ఒక వ్యక్తి జీహెచ్ఎంసీ నుంచి తీసుకొన్న అనుమతులకు విరుద్ధంగా సెల్లార్‌ను తవ్వి నిబంధనలు పాటించకుండా పనులు చేపడుతున్నారు. దీంతో సమీప భవనాలకు ముప్పు పొంచి ఉంది. ఈ మేరకు లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ ప్రతినిధులు సంతోష్‌నగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు, డీసీకి ఫిర్యాదు చేయడంతో అధికారులు భవన నిర్మాణ పనులను నిలిపివేసి సీజ్ చేశారు. అయితే మరుసటి రోజే మళ్లీ యాథావిధిగా సెల్లార్ తవ్వకాలు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌కు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అక్రమ సెల్లార్ పనులతోపాటు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పనులను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

## 'ఓయో'లో పేకాట..

పోచారం,మార్చి 10: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని నవ్యగ్రాండ్ ఓయో హోటల్ గదిలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజు కథనం ప్రకారం.. హోటల్ గదిలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు వెళ్లి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.27,600నగదు,7మొబైల్ ఫోన్లు, 3 సెట్స్ కార్డ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పేరు మార్పు**

నా పేరు బోగోజు వసుద, W/o. బోగోజు సురేష్ కుమార్, ఇ.నెం. 4-7-393/2, రాఘవేంద్రనగర్ కాలనీ, హయత్‌నగర్. హనుమాన్‌నగర్, హైదరాబాద్, 501505, నా సర్టిఫికెట్లలో పోతకనూరి శ్రీలత అని ఉంది. ఇప్పుడు బోగోజు వసుద అని మార్చుకుంటున్నాను.